సాక్షి ఖమ్మం

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



ఆక్రమణల గుర్తింపునకు సర్వే

జిల్లా కేంద్రంలోని అలుగు వాగు పరిధిలో ఆక్రమణల గుర్తింపునకు మూడు శాఖల అధికారులు సర్వే మొదలుపెట్టారు. IIలో



మరోమారు గెలిపించండి

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మరోమారు తనను గెలిపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. IIలో

గరిష్టం / కనిష్టం
32° / 19°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయమే ఎండ ప్రభావం మొదలై మధ్యాహ్నానికి మరింత పెరుగుతుంది. సాయంత్రం తర్వాత చలి ప్రభావం ఉంటుంది.

రైతులకు అండగా 'సాక్షి'

మార్కెటింగ్ శాఖ అధికారితో రేపు 'ఫోన్ ఇన్'



ఎం.ఏ.అలీం

ఖమ్మంవ్యవసాయం: పంటల కొనుగోళ్ల సీజన్ మొదలైన నేపథ్యాన రైతులకు అవగాహన కల్పించేలా 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రస్తుతం పత్తి, వరి ధాన్యం విక్రయాలు మొదలుకాగా, రైతులకు కనీస మద్దతు ధర దక్కడం లేదు. ఇందుకోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయగా నిబంధనలను తెలుసుకోవడంతో సమస్యలను వివరించేందుకు రైతులు ఫోన్ ఇన్‌ను ఉపయోగించుకోవచ్చు. రైతుల సందేహాలను జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం నివృత్తి చేస్తారు.

తేదీ : 28-10-2024, సోమవారం
సమయం : ఉదయం 8-30 నుంచి 9-30 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
73307 33149

ఎట్టకేలకు సర్వే షురూ..



- సర్వే నంబర్ల వారీగా పంటల నమోదు
- క్షేత్రస్థాయిలో ఫొటో ఆధారంగా సర్వే
- ఎప్పటికప్పుడు డీసీఎస్ యాప్‌లో నిక్షిప్తం
- మహిళా ఏఈఓలకు ఇబ్బందే అంటున్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను తెలుసుకునేందుకు కేంద్రప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) జిల్లాలో మొదలైంది. పంటల వివరాలు, ప్రస్తుత స్థితిగతులను తెలుసుకుని దిగుబడి అంచనా ఆధారంగా మద్దతు ధర అందించడమే లక్ష్యంగా కేంద్రం డీసీఎస్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ బాధ్యతను వ్యవసాయ విస్తర్ణాధికారు(ఏఈఓ)లకు అప్పగించగా తొలుత నిరాకరించినప్పటికీ ప్రభుత్వం, ఉన్నతాధికారుల సూచనలతో సర్వే మొదలుపెట్టారు. తొలుత ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా విభజించి ఏఈఓలను నియమించారు. అయితే, పెరిగిన వనరులు, అటవీ భూముల్లో పంటల సాగు తదితర కారణాలతో క్లస్టర్ల విస్తీర్ణం పెరిగింది. పలుచోట్ల అటవీ భూములకు పట్టాలు ఇవ్వడంతో ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములు పెరిగాయి. దీంతో చాలావరకు క్లస్టర్లు 10వేల నుంచి 12 వేల ఎకరాలకు విస్తరించాయి. ఈ మేరకు వ్యవసాయ, ఉద్యాన తదితర పంటలన్నింటినీ డీసీఎస్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 7లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలను రైతులు సాగు చేస్తున్నట్లు అంచనా.

క్షేత్రస్థాయికి వెళ్లడం తప్పనిసరి..

వ్యవసాయ భూమి సర్వే నంబర్ ఆధారంగా సర్వే చేపడుతున్నారు. సదరు సర్వే నంబర్‌లోకి ఏఈఓ ప్రత్యక్షంగా వెళ్తేనే డీసీఎస్ తెరుచుకుంటుంది. ఏఈఓ వెళ్లి ఒకే సర్వే నంబర్‌లో ఎన్ని రకాల పంటలు సాగయ్యాయో వాటి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వే నంబర్, రైతు పేరు, పూర్తి విస్తీర్ణం, పంట సాగు విస్తీర్ణం, సాగు చేసిన పంటల వివరాలను గుంటలతో సహా నమోదు చేయాలి.



యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ

ఫొటోతో సహా..

ఏఈఓలు క్షేత్రస్థాయికి వెళ్తే తప్ప డిజిటల్ క్రాప్ సర్వే చేయడం సాధ్యం కాదు. అక్కడకు వెళ్లి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తే డీసీఎస్ యాప్ ఓపెన్ అవుతుంది. అనంతరం క్షేత్రంలో సాగైన పంట ఫొటో తీయాలి. అనంతరం ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయడమే కాక రైతు, పంట వివరాలు, నీరు, ఇతర వనరులను నమోదు చేయాల్సి ఉంటుంది.

స్పష్టమైన ఫొటోతో నమోదు



నిబంధనల మేరకు ఏఈఓలు డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించాలి. ప్రతీ సర్వే నంబర్‌లో సాగు చేసిన పంటలను డీసీఎస్ యాప్‌లో నమోదు చేయాలి. పంటల ఫొటోలను స్పష్టంగా తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రతీ ఏఈఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సర్వే చేస్తూ ముందుకు సాగాలి. సందేహాలు తలెత్తితే ఉన్నతాధికారులను సంప్రదించాలి.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి



సర్వే నిర్వహిస్తున్న గర్భిణి ఏఈఓ

సాంకేతిక ఇబ్బందులు

డీసీఎస్ నిర్వహణలో అనేక రకాల సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొండలు, గుట్టలు, గ్రామాలకు సుదూర ప్రాంతాల్లో ఉన్న క్షేత్రాల్లో సిగ్నళ్లు అందక యాప్ తెరుచుకోవడం లేదని ఏఈఓలు చెబుతున్నారు. దీంతో సర్వే చేయడం, వివరాల నమోదు ఇబ్బందికరంగా మారిందని తెలుస్తోంది. ఈ సమస్యను అధిగమించడం ఎలాగో ఏఈఓలకు అంతుపట్టకపోగా, అధికారులు సైతం స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

అభద్రతాభావంలో మహిళా ఏఈఓలు

డిజిటల్ పంట సర్వే మహిళా ఏఈఓలకు ఇబ్బందికరంగా ఉంది. కొండలు, గుట్టల వెంట ఒంటరిగా వెళ్లి సర్వే చేసే క్రమాన వారు అభద్రతకు గురవుతున్నారు. గ్రామాల శివారు ప్రాంతాలకు వెళ్లడం.. చెరువులు, వాగుల అంచుల నుంచి వెళ్లటం ప్రమాదకరంగా ఉంటోందని చెబుతున్నారు. కాగా, ఇప్పటికే 17 రకాల విధులు నిర్వర్తిస్తున్న తమకు ఇది 18వ పని అని.. పొరుగు రాష్ట్రాల్లో మాదిరి ఏజెన్సీలకు అప్పగించాలని కోరుతున్నారు. రెవెన్యూ అసిస్టెంట్లు లేదా ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని కోరినా ఫలితం లేక సర్వే మొదలపెట్టాల్సి వచ్చిందని వాపోతున్నారు.

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

- కలెక్టరేట్‌లో క్యాంటీన్, ఎస్‌బీఐ శాఖ, ఫీడింగ్ రూమ్ ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



దివ్యాంగురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్, ఫీడింగ్ రూమ్, ఎస్‌బీఐ శాఖతో పాటు భోజనశాల, కలెక్టరేట్ గేట్ వద్ద నిర్మించిన బస్టాప్‌ను రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ప్రారంభించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం పరిశీలించారు. ఈక్రమంలో బస్టాప్ వద్ద ఉన్న ప్రజలతో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్‌కు వివిధ పనులపై వచ్చిన వారు రహదారి వెంట ఎండావానలో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించి బస్టాప్ నిర్మించామని తెలిపారు. అలాగే, ఉద్యోగుల కోసం ఎస్‌బీఐ శాఖ, భోజనశాల, ఫీడింగ్ రూమ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. అనంతరం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, డీఆర్‌ఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల వివరాలు ఆరా...

వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చిన వారితో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వైరా మండలం లింగన్నపేటకు చెందిన రైతు నాగేశ్వరరావుతో మాట్లాడి పంటల సాగు, దిగుబడిపై తెలుసుకున్నారు. అయితే, ఆయిల్ పామ్ సాగుతో లాభాలు ఉన్నందున దృష్టి సారించాలని సూచించారు. వరదలతో దెబ్బతిన్న పంట పొలాలకు పరిహారం అందిస్తామన్నారు. అలాగే, బీ ఫార్మసీ విద్యార్థి ధీరజ్‌తో మాట్లాడారు. అనంతరం సుబ్లేడుకు చెందిన దివ్యాంగురాలు తాను డీఎస్సీలో ఎంపిక కానందున ఉపాధి కల్పించాలని కోరగా ఖాళీ ఉన్న పాఠశాలలో వలంటీర్‌గా అవకాశం కల్పిస్తామని తెలిపారు. అయితే, ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అలాగే, వైరా మండలం పాలడుగుకు చెందిన వృద్ధుడు రాజయ్య తమ ఇంటిని కొనుగోలు చేసి వ్యక్తి డబ్బు చెల్లించకపోగా బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేయగా వైరా తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి నగదు ఇవ్వలేని పక్షంలో ఇంటిని స్వాధీనం చేసుకుని రాజయ్యకు ఇప్పించాలని ఆదేశించారు.

పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



తెగుళ్లు సోకిన పొలంలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: మండలంలోని పాలేరు, నాయకన్‌గూడెం గ్రామాల్లో తెగుళ్లు సోకిన వరి పొలాలను అంతర్జాతీయ వరి పరిశోధనా స్థానం, హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. 'ఎమర్జెన్సీ డీసీజెస్' ప్రాజెక్టులో భాగంగా పొలాలను సందర్శించిన వారు పలు రకాల తెగుళ్లను గుర్తించారు. ప్రస్తుతం వరిలో అగ్గితెగులు, పాముపొడ తెగులు, మాని పండు తెగుళ్లు ఆశించాయని గుర్తించగా, నమూనాలను సేకరించారు. వీటిని పరీక్షిస్తూ తెగుళ్లను తట్టుకోగలిగిన వంగడాల రూపకల్పనకు పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధకులు డాక్టర్ శ్రీధర్‌తోపాటు బాలరాజు, శుభం ప్రజాపతి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఫణిశ్రీ, ఏఈఓ మానస పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జర్మనీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం రాపర్తినగర్: జర్మనీలో ఉద్యోగాల కోసం ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈనెల 29లోగా ఐటీ హబ్‌లోని టాస్క్ ప్రాంతీయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి ఎస్.మాధవి సూచించారు. నేరుగా లేదా మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలుందని వెల్లడించారు. ఆటోమోటివ్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, హెవీ మోటార్ డ్రైవర్ పోస్టుల భర్తీ ప్రభుత్వ, ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా జరుగుతుందని తెలిపారు. వివరాల కోసం www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌లో లేదా 94400 52592, 94400 49013, 81252 51408 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) ఫీమేల్ ట్రెనింగ్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువును పొడిగించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావు తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన వారు 'కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్' పేరిట తీసిన రూ.200 డీడీ జత చేసి దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. వివరాలకు ట్రెనింగ్ స్కూల్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ 'రాజధాని'

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లే వారికి ప్రయాణ సమయాన్ని తగ్గించేలా రాజధాని ఏసీ నాన్‌స్టాప్ బస్సులు నడిపించనున్నట్లు ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ బస్సుల ద్వారా మూడు గంటల్లోనే ఎల్‌బీ.నగర్‌కు చేరుకోవచ్చని వెల్లడించారు. ఖమ్మం నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు నాన్‌స్టాప్ ఏసీ రాజధాని బస్సులు తెల్లవారుజామున 4గంటలకు, ఉదయం 5, 6, 7 గంటలకే కాక సాయంత్రం 4, 5, 6, 7 గంటలకు ఉంటాయని తెలిపారు. అలాగే, హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి ఖమ్మంకు తెల్లవారుజామున 5గంటలకు ఉదయం 6, 7, 8గంటలకే కాక సాయంత్రం 4.30, 5.30, 6.30, 7.30 గంటలకు మొదలవుతాయని వెల్లడించారు. ఇవేకాక ప్రతీ గంటకు ఒక ఏసీ బస్ ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని డీఎం తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడాలి



పారిశుద్ధ్యంపై ఆరా తీస్తున్న డీపీఓ ఆశాలత

రఘునాథపాలెం: గ్రామపంచాయతీల్లో ఉద్యోగులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. ఏ రోజుకారోజు చెత్త తరలించడమే కాకుండా డ్రెయినేజీల్లో మురుగు నీరు నిల్వకుండా పర్యవేక్షించాలని తెలిపారు. మండలంలోని వీ.వీ.పాలెంలో డంపింగ్‌యార్డు, శ్మశాన వాటిక, ప్రకృతి వనాన్ని శనివారం పరిశీలించిన ఆమె రికార్డులు తనిఖీ చేశాక కార్యదర్శి కృష్ణ, సిబ్బందికి సూచనలు చేశారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి..

పోలీసు కమిషనర్ సునీల్‌దత్



రక్తదానం చేస్తున్న ఏసీపీ రమణమూర్తిని అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: రక్తదానం చేయడమంటే ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నట్లేనని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఖమ్మంలోని హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోడ్డుప్రమాదాల్లో గాయపడిన వారికే కాక ఇంకొందరు సమయానికి రక్తం లభించక ప్రాణాపాయ స్థితి ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మేరకు ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరు అపోహలను విడనాడి రక్తదానానికి ముందుకు రావాలని సీపీ సూచించారు. ఈ శిబిరంలో పోలీసు సిబ్బందితో పాటు ఆటోడ్రైవర్లు, యువకులు 100మంది రక్తదానం చేయగా సర్టిఫికెట్లు అందజేశారు. అదనపు డీసీపీలు ప్రసాద్‌రావు, నరేష్‌కుమార్, కుమారస్వామి, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాసులు, మల్లయ్య, నర్సయ్య, సీఐలు రమేష్, ఉదయ్‌కుమార్, బాలకృష్ణ, మోహన్‌బాబు, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, డాక్టర్ జితేందర్‌తో పాటు సంకల్ప స్వచ్ఛంద సంస్థ, ఆటో యూనియన్ల బాధ్యులు పాల్గొన్నారు.

54వ సారి రక్తదానం

తిరుమలాయపాలెం: ఖమ్మంలో ఏర్పాటు చేసిన శిబిరంలో బీఆర్‌ఎస్ నాయకుడు రవి రక్తదానం చేశారు. ఆయన రక్తదానం చేయడం 54వ సారి కావడంతో పోలీసులు అధికారులు అభినందించారు.



54వ సారి రక్తదానం చేసిన రవితో అధికారులు

ఆర్థిక సంఘం నిధులొచ్చాయ్...

- కేఎంసీతో పాటు మున్సిపాలిటీలకు మంజూరు
- పారిశుద్ధ్య నిర్వహణతో పాటు అభివృద్ధి పనులకు కేటాయింపు

ఖమ్మంమయూరిసెంటర్: నిధులు లేమితో అల్లాడుతున్న మున్సిపాలిటీలకు ఊరటనిచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్థానికంగా సమకూరుతున్న ఆదాయంతో పరిపాలన కూడా కష్టమైన తరుణాన 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి నిధులను మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలోని మణుగూరు మున్సిపాలిటీ మినహా ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఆరు మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనులకు..

ఆర్థిక సంఘం నుండి మంజూరైన నిధులను కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, అభివృద్ధి పనులకు వినియోగించుకునే వీలుంది. పారిశుద్ధ్య వాహనాల కొనుగోలు, అద్దె చెల్లింపు, ఇతర పనుల నిర్వహణ, పచ్చదనం పెంపు, వైకుంఠధామాల నిర్మాణం, నిర్వహణకు, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి నిధులు ఉపయోగించే వెసులుబాటు కల్పించారు. ఈ నిధులతో మున్సిపాలిటీల్లోని కొన్ని సమస్యలకు పరిష్కారం లభించనుంది.

కేఎంసీకి హెల్త్ గ్రాంట్ కూడా....

15వ ఆర్థిక సంఘం నుంచి అన్‌టైడ్ నిధులతోపాటు హెల్త్ గ్రాంట్‌ను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో భాగంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.1.43 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులను నగరంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి వినియోగించుకోవచ్చు. అటు అన్‌టైడ్ నిధులతోపాటు అర్బన్ హెల్త్ గ్రాంట్ ఒకేసారి విడుదల కావడంతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఖాతాలో రూ.3,81,80,114 జమ అయ్యాయి.



కార్పొరేషన్, మున్సిపాలిటీల వారీగా మంజూరైన ఆర్థిక సంఘం నిధులు

కార్పొరేషన్ / మున్సిపాలిటీలు	మంజూరైన నిధులు (రూ.ల్లో)
ఖమ్మం కార్పొరేషన్	2,38,80,114
మధిర	29,30,789
సత్తుపల్లి	28,52,475
వైరా	28,66,414
కొత్తగూడెం	65,33,439
పాల్వంచ	71,52,449
ఇల్లెందు	28,02,490

సమన్వయంతోనే సత్వర న్యాయం

- హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి శ్రీసుధ
- మధిరలో సబ్ కోర్టు ప్రారంభం, నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన
- హాజరైన హైకోర్టు జడ్జిలు భీమపాక నగేష్, శరత్



మధిరలో కోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ, చిత్రంలో హైకోర్టు జడ్జిలు శరత్, నగేష్, జిల్లా జడ్జి రాజగోపాల్ తదితరులు

మధిర: న్యాయవాదులు – బెంచ్‌కు మంచి సంబంధం ఉండాలని, తద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందడమే కాక ఎక్కువ కేసుల పరిష్కారానికి వీలవుతుందని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి పి.శ్రీసుధ తెలిపారు. మధిరకు మంజూరైన సబ్ కోర్టును పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్‌లో ఏర్పాటుచేయగా శనివారం ఆమె హైకోర్టు జడ్జిలు భీమపాక నగేష్, కె.శరత్‌తో కలిసి ప్రారంభించారు. తొలుత కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జడ్జిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆతర్వాత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించగా న్యాయమూర్తులు కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జిల సమక్షాన సీనియర్ సివిల్ జడ్జి మీరా ఖాసిం సాహెబ్ పలు కేసులను విచారించారు. ఈమేరకు న్యాయమూర్తి శ్రీసుధ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాతో తనకు అనుబంధం ఉందని, గతంలో వరంగల్ ట్రిబ్యునల్‌లో జడ్జిగా పనిచేసినప్పుడు ఖమ్మలో ఇన్‌చార్జిగా వ్యవహరించానని గుర్తు చేసుకున్నారు. ఆ సమయాన భద్రాద్రి రామాలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. న్యాయవాదుల సహకారంతోనే కక్షిదారులకు సత్వర న్యాయం అందించగలమని చెప్పారు. అంతకుముందు రూ.24 కోట్ల నిధులతో నిర్మించిన కోర్టు భవన సముదాయం, రూ.39లక్షలతో నిర్మించనున్న రికార్డు రూమ్‌కు న్యాయమూర్తులు భూమి పూజ చేసి భవన సముదాయ ప్లాన్‌ను పరిశీలించారు. పనులు త్వరగా ప్రారంభించి గడువులోగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమాల్లో జిల్లా జడ్జి జి.రాజగోపాల్, సత్తుపల్లి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు, మధిర కోర్టు జడ్జి టి.కార్తీక్‌రెడ్డి, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ హేమలత, మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, దిరిశాల జగన్ మోహన్‌రావు, కావూరి రమేష్, కోట జ్ఞానేశ్, కట్టా పూర్ణచంద్రరావు, వైరా ఏసీపీ రెహమాన్, మధిర సీఐ మధుతో పాటు శ్రీనివాసుల అనంతచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో హైకోర్టు జడ్జి శ్రీసుధను సన్మానిస్తున్న జిల్లా జడ్జి, తదితరులు

ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్‌లో...

ఖమ్మంలీగల్: మధిరలో కోర్టును ప్రారంభించిన అనంతరం హైకోర్టు జడ్జి పి.శ్రీసుధ ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయవాదులతో సమావేశమై మాట్లాడారు. ఆతర్వాత వలనరబుల్ విట్‌నెస్ డిపోసిషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జిల్లా జడ్జి రాజగోపాల్, న్యాయమూర్తులు అపర్ణ, అర్చనాకుమారి, రాంప్రసాద్, కల్పన శివరంజని, దీప, మాధవి, శాంతిలత, కార్తీక్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్‌తో పాటు చింతనిప్పు వెంకట్, ఉపేందర్‌రెడ్డి, వెంకట్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ట్రెయినీ అధికారులు



ట్రెయినీ అధికారులతో మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్/ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల జీవన స్థితిగతులపై కేంద్రప్రభుత్వ పరిధిలోని సివిల్ సర్వీసెస్ ట్రెయినీ అధికారులు చేస్తున్న అధ్యయనం శనివారం ముగిసింది. ఈసందర్భంగా అధికారులు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించగా కమిషనర్ అభిషేక్ అగస్త్య వారికి ఖమ్మం ప్రత్యేకత, కార్పొరేషన్ పరిపాలన, ఇతర అంశాలను వివరించారు. అలాగే, ఖమ్మం ఎన్నెస్పీ పాఠశాలను కూడా సందర్శించి విద్యార్థులు నమోదు అధికంగా ఉండటంపై అభినందించారు. ఏఎంఓ రవికుమార్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ట్రెయినీ అధికారులు సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌తో సమావేశమై రోజువారీగా ఓపీ నమోదు, వైద్యసేవలు, ఆస్పత్రిలోని సౌకర్యాలను తెలుసుకున్నారు. అలాగే, డయాలసిస్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు.

క్లుప్తంగా

వన సమారాధనకు ఆహ్వానం



భట్టికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జేఏసీ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: వచ్చే నెల 3వ తేదీన ఖమ్మంలో నిర్వహిస్తున్న సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, వనసమారాధనకు హాజరుకావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను జేఏసీ రాష్ట్ర బాధ్యులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, దేవరకొండ ఆహ్వానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శనివారం ఆయనకు ఆహ్వాన పత్రిక అందించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో జేఏసీ బాధ్యులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణపై అవగాహన

ఖమ్మంమయూరిసెంటర్: 'స్థానిక సంస్థలలో వెనుకబాటుతనం' అంశంపై వచ్చేనెల 5న కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న నేపథ్యాన కులాల వారీగా అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి జి.జ్యోతి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఆమె బీసీ, ఎంబీసీ కుల సంఘాల నాయకులతో సమావేశమై మాట్లాడారు. స్థానిక సంస్థల్లో వెనకబాటుతనం స్వభావం, ప్రభావాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటైందన్నారు. ఈ కమిషన్ ఆధ్వర్యాన నవంబర్ 5న కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని తెలిపారు. ఈమేరకు అభిప్రాయాలు, సమస్యలను ఆరు సెట్ల వెరిఫికేషన్ ఆఫిడవిట్ అందజేయాలని సూచించారు. నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, వీరమల్ల ఊర్మిళ, మరళా లింగయ్య గౌడ్, పెళ్లూరి విజయ్ కుమార్, వెంకటరమణయాదవ్, గద్దె వెంకటరామయ్య, ఆకుల గాంధీ, పల్లెపు సోమరాజు, షేక్ షకీనా, డాక్టర్ కే.వీ.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ హయాంలోనే పేదలకు లబ్ధి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయాలకతీతంగా పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా లబ్ధి జరిగిందని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్‌తో కలిసి ఖమ్మంలో బుధవారం ఆయన 56మందికి రూ.19,16,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసి మాట్లాడారు. కేసీఆర్ పాలనలో వేలాది మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందించినట్లు తెలిపారు. కానీ ఇప్పుడు సీఎం సహాయ నిధి అందని ద్రాక్షగా మారిందని పేర్కొన్నారు. నాయకులు పోట్ల శ్రీను, డేరంగుల బ్రహ్మం, ముత్యాల వెంకటప్పారావు, పోగుల శ్రీను, బెల్లం వేణు, ఇంటూరి శేఖర్, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, లక్ష్మారెడ్డి, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధి కోసం గెలిపించండి



తల్లాడ: అన్నారుగూడెం పాఠశాలలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ఏన్కూరు/తల్లాడ: ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం గత ఐదున్నరేళ్లుగా కృషి చేస్తున్న తనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోమారు గెలిపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ఈమేరకు ఉపాధ్యాయులంతా ఓటర్లుగా నమోదు చేసుకుని తనను మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఏన్కూరు, తల్లాడ మండలాల్లోని పలు పాఠశాలలను శనివారం సందర్శించిన ఆయన ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించి మాట్లాడారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావుతో పాటు డీ.ఎస్.నాగేశ్వరావు, రాంచంద్, శ్రీదేవి, షేక్ లాల్ సయ్యద్, తాళ్లూరు శ్రీనువాసరావు, శారదాదేవి, రామకృష్ణ, శ్రీదేవి, సంపత్‌కుమార్, సైదులు, మురళీకృష్ణ, ఇందు ప్రియ, స్వరాజ్యలక్ష్మి, సుధాకర్, రామారావు, రత్నకుమారి పాల్గొన్నారు.

నేడు నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికకు ఆదివారం పోటీలు నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఫణికుమార్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీల్లో ఎంపిక చేయనున్న జట్లు నవంబర్ 8నుంచి ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకల్లా హాజరుకావాలని సూచించారు.

■ ప్రారంభోత్సవానికి ముస్తాబు !

- కలెక్టరేట్ ద్వారం వద్ద బస్‌షెల్టర్
- ఆవరణలో ఫీడింగ్ రూమ్, క్యాంటీన్, ఎస్‌బీఐ శాఖ
- అధికారులు, ఉద్యోగుల్లో ఆనందం



కలెక్టరేట్ రెండో ఫ్లోర్‌లో ముస్తాబైన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్



సిద్ధమైన బస్ షెల్టర్

కలెక్టరేట్‌లో ఉద్యోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఇక్కడ విధుల్లో చేరిన తొలినాళ్లలోనే శాఖల వారీగా అధికారులతో సమావేశమై కావాల్సిన సౌకర్యాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత అమలుకు శ్రీకారం చుట్టారు. ఈక్రమంలోనే కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టారు. అంతేకాక ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, చిన్నపిల్లల తల్లులు, ఇతర మహిళా ఉద్యోగుల కోసం ఫీడింగ్ రూమ్, ఎస్‌బీఐ బ్రాంచ్ ఏర్పాటు చేయించారు. వీటిని ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనుండగా.... కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

– ఖమ్మం సహకారనగర్



ప్రారంభానికి సిద్ధమైన ఫీడింగ్ రూమ్





రంగురంగుల చిత్రాలతో భోజనశాల

ఆక్రమణల గుర్తింపునకు సర్వే

- ఖానాపురం అలుగు వాగుపై అధికారుల దృష్టి
- ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఆధ్వర్యాన రంగంలోకి..



చైతన్యనగర్‌లో వాగు వద్ద సర్వే చేస్తున్న అధికారులు



ఖమ్మంఅర్బన్: గతనెల మొదటి వారంలో వచ్చిన వరదలతో ప్రాచుర్యంలోకి వచ్చిన జిల్లా కేంద్రంలోని ఖానాపురం అలుగు వాగుపై అధికారులు దృష్టి సారించారు. ఖానాపురం చెరువు వద్ద నుండి లకారం చెరువు వరకు ఉన్న ఖానాపురం అలుగు వాగు ఆక్రమణకు గురి కావడంతోనే ఈ ప్రాంతం నీట మునిగిందని గుర్తించారు. ఈమేరకు శనివారం జలవనరులశాఖ, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సంయుక్త ఆధ్వర్యాన సర్వే చేశారు. ఖమ్మం బైపాస్‌రోడ్డు చైతన్యనగర్‌లోని అయ్యప్పస్వామి గుడి నుండి 11వ డివిజన్ కవిరాజ్‌నగర్‌లోని మసీదు వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేలో జలవనరులశాఖ డీఈ ఉదయ్‌ప్రతాప్, ఏఈ వెన్నెల, మున్సిపల్‌శాఖ ఏసీపీ వసుంధర, కేఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారి నరేష్, సర్వేయర్ శ్రీనివాస్, ఆర్‌ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వందలాది కుటుంబాలకు నష్టం..

గతనెలలో కురిసిన భారీ వర్షంతో అలుగు నీరే కాక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వరద కాలనీల్లోని నివాసాల్లోకి చేరింది. దీంతో వందలాది కుటుంబాలు నష్టాన్ని చవిచూశాయి. నగరం నడిబొడ్డున ఉన్న చైతన్యనగర్, కవిరాజ్‌నగర్, వరదయ్యనగర్ తదితర ప్రాంతాల్లో నివాసాల్లోకి వరద ముంచెత్తింది. గంటల తరబడి నీటిలోనే ఉన్న స్థానికులు రూ.లక్షల విలువైన సామగ్రి నష్టపోయారు. వాగు అక్రమణ జరగడంతోనే నీరు సాఫీగా వెళ్లక ఇలా జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటికప్పుడు అలుగు వాగులో పేరుకుపోయిన సిల్ట్, అడ్డుగా ఉన్నాయని భావిస్తూ లకారం చెరువు వద్ద పైపులను తొలగించారు. అలాగే, వాగు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ఐస్ ఫ్యాక్టరీని కూల్చివేశారు. కాగా, ఈ ప్రాంతంలో స్థలాలు ఆక్రమించిన పలువురు ఇళ్లు కట్టగా, అపార్ట్‌మెంట్లు, ఒక ప్రైవేట్ పాఠశాల భవనాన్ని నిర్మించారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మరోమారు సమస్య ఎదురుకాకుండా సర్వేకు ఆదేశించారు. వాగును అభివృద్ధి చేస్తూ వరద ప్రభావం నివాసాలపై పడకుండా ఆక్రమణలను గుర్తించేందుకు మూడు శాఖల అధికారులు సర్వే మొదలుపెట్టారు. వాగు నక్షా ప్రకారం మొత్తం విస్తీర్ణం, ఇరువైపుల బఫర్‌జోన్ ఎంత అనే వివరాలు తేల్చాక ఆక్రమణల విషయంలో చర్యలు తీసుకునే అవకాశముందని తెలిసింది.

వరద బాధిత కుటుంబాలకు చేయూత



సరుకుల పంపిణీలో పాల్గొన్న ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంవన్‌టౌన్: గతనెల మొదటి వారంలో వరదలతో నష్టపోయిన 18 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని 400 కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు హైదరాబాద్‌కు చెందిన జగతి ఫౌండేషన్ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఖమ్మం 48వ డివిజన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో కేర్ హాస్పటల్ చేయూతతో సరుకుల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. జగతి ఫౌండేషన్ ఫౌండర్ దుర్గాకళ్యాణి, సభ్యులు అబూబకర్, రాంచందర్, రాజా, కుమార్‌తో పాటు కేర్ ఆస్పత్రి బాధ్యులు నాగార్జున, రామకృష్ణ కిషోర్, ఖమ్మం అర్బన్, రూరల్ సీడీపీఓలు వీరభద్రమ్మ, కమలప్రియతో పాటు సత్యశీల తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వ తవ్వకం ప్రారంభం



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కూసుమంచి: మండలంలో పెండింగ్ ఉన్న ఎస్సారెస్పీ ఫేజ్–2 కాల్వ తవ్వకం పనులను శనివారం అధికారులు ప్రారంభించారు. అక్కడక్కడా కాల్వల నిర్మాణాన్ని రైతులు అడ్డుకోవడంతో ఇన్నాళ్లు పనులు నిలిచిపోయాయి. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు రైతులతో మాట్లాడి ఒప్పించారు. ఈమేరకు పనులు ప్రారంభం కాల్వల తవ్వకం పూర్తయితే మండలంలోని గంగబండ తండా, గురువాయిగూడెం, జుజుల్‌రావుపేట తదితర గ్రామాల్లోని 885 ఎకరాలకు సాగునీరు అందనుందని డీఈఈ రమేష్‌రెడ్డి తెలిపారు.

ఇంటి వద్దకే ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యాన లాజిస్టిక్ ద్వారా ఇంటి వద్దకే పార్సిళ్లు చేరవేయనున్నట్లు ఉమ్మడి వరంగల్, ఖమ్మ ఏటీఎం పవన్‌కుమార్ తెలిపారు. వినియోగదారుల పార్సిళ్లను వేగంగా, భద్రంగా చేరవేస్తుండగా, నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. తొలిదశలో హైదరాబాద్‌లోని ఎంపిక చేసిన 31 ప్రాంతాల్లో ఇంటి వద్దకే పార్సిళ్లు చేరవేయనున్నట్లు తెలిపారు. బుక్ చేసే సమయాన పూర్తి చిరునామా, పిన్‌కోడ్ తెలియచేసి హోం బుకింగ్‌గా నమోదు చేయాలని చెప్పారు. హైదరాబాద్‌లో అమలుచేయనున్న కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపచేయాలని ఆలోచన ఉందని తెలిపారు.

పీడీఎస్ బియ్యం తరలింపుపై కేసు

నేలకొండపల్లి: నాలుగు రోజుల క్రితం అక్రమంగా తరలిస్తున్న 35క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండలంలోని మోటాపురం వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించగా, విచారణ అనంతరం శనివారం అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.సంతోష్ తెలిపారు.

సేవాదళ్‌లో కష్టపడే వారికి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న దాసు

ఖమ్మంవన్‌టౌన్: బ్రిటీష్ వారిపై పోరాటంలో అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ కీలక పాత్ర పోషించిందని టీపీసీసీ సేవాదళ్ ఉపాధ్యక్షుడు మంఖాల దాసు తెలిపారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం జరిగిన సేవాదళ్ కార్యకర్తల సమావేశానికి సయ్యద్‌గౌస్ అధ్యక్షత వహించగా దాసు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ మాట్లాడారు. బూత్‌స్థాయి నుండి కాంగ్రెస్ సేవాదళ్‌ను పటిష్టం చేయాలని సూచించారు. ఈమేరకు కష్టపడే వారిని అవకాశాలు వరిస్తాయని తెలిపారు. నాయకులు దయాకర్‌రావు, బచ్చలకూరి నాగరాజు, సుబ్బారావు, నగేష్, బాపుసింగ్, మున్నా, పాషా, అబ్దుల్ అహ్మద్, వసీం, జహీర్, బాబురావు, శ్రీను, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు ఏపీ వాసి

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయి దారి తప్పి పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన మహిళను చేరదీసి చికిత్స అందించాక కోలుకోవడంతో కుటుంబీకులకు అప్పగించారు. ఖమ్మం ఎఫ్‌సీఐ గోదాంల వద్ద కొన్నాళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ తిరుగుతోందని స్థానికులు అందించిన సమాచారంతో ఖమ్మం త్రీటౌన్ పోలీసులు అన్నం ఫౌండేషన్‌లో చేర్పించారు. దీంతో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆమెకు మమత ఆస్పత్రి దివ్యాంగుల వార్డులో వైద్యం చేయించగా ఇటీవల కోలుకున్న ఆమె తన పేరు శికారి ధర్మావతి అని, తమది ఏపీలోని కర్నూలు అని చెప్పడమే కాక సోదరుడి వివరాలు వెల్లడించింది. దీంతో అక్కడి పోలీసుల ద్వారా ఆమె సోదరుడిని పిలిపించి శనివారం డీడబ్ల్యూఓ రాంగోపాల్‌రెడ్డి సమక్షాన అప్పగించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులతో సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సింగరేణి జీఎం(పర్సనల్) సామ్యేల్ సుధాకర్ సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యాన కొత్తగూడెంలోని జీఎం కార్యాలయంలో శనివారం రోవర్స్ అండ్ రేంజర్స్‌కు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రోవర్స్ అండ్ రేంజర్స్ జాతీయస్థాయిలో అవార్డులు పొందేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తోడ్పానందించేందుకు సిద్ధార్థ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ నుంచి యూనిఫామ్ అందజేశామని తెలిపారు. అధికారులు జి.రాజేంద్రప్రసాద్, ముకుంద సత్యనారాయణ, జీకే.కిరణ్‌కుమార్, టి.శ్రీనివాసరావు, వరప్రసాదరావు, పాసినెట్, వెంకటస్వామి, ఎల్.గోపాలకృష్ణ, పి.రామస్వామి, ప్రసాద్, ఎం.కొమరయ్య, ప్రిన్సిపాల్ రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్‌ఎం

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపోను ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ శనివారం సందర్శించారు. డిపో గ్యారేజీలో బస్సుల నిర్వహణపై మెకానిక్‌లను అడిగి తెలుసుకున్నారు. బుకింగ్ చార్ట్ దగ్గర డ్రైవర్లు, కండక్టర్ల కేటాయింపు, ఎర్నింగ్ సెక్షన్, టిమ్స్ వంటి వివరాలపై డీఎంతో చర్చించారు. డిపోలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే సిబ్బంది అందరూ కష్టపడి పని చేయాలని సూచించారు. బస్టాండ్‌తో పాటు డిపో ఆవరణలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దసరా సందర్భంగా డిపోకు ఎక్కువ ఆదాయాన్ని తెచ్చినందుకు సిబ్బందిని ప్రశంసించారు. ఆయన వెంట సీఐ శ్రీనివాసరావు, కొత్తగూడెం డిపో మేనేజర్ మలగం దేవేందర్ గౌడ్ ఉన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

సెల్‌ఫోన్లు స్వాధీనం, ల్యాప్‌టాప్ రికవరీ

కాశిబుగ్గ : రైళ్లలో చోరీలు చేస్తూ తప్పించుకుని తిరుగుతున్న నిందితులను వరంగల్ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. జీఆర్పీ సీఐ పి.సురేందర్ శనివారం వెల్లడించిన వివరాలు... ఖమ్మం రూరల్ పెద్ద తండా జలగంనగర్‌కు చెందిన పండ్ల వ్యాపారి గద్దల రామకృష్ణ, ఆటో డ్రైవర్ బానోత్ సాయికుమార్, ఖమ్మం రూరల్ రావిచెట్టు బజార్‌లో నివాసం ఉంటున్న బైక్ మెకానిక్ దుబ్బాకుల కిషోర్ కలిసి కొన్నాళ్లుగా రైళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. జీఆర్పీ, ఆర్‌పీఎఫ్, సీఐబీ సిబ్బంది శనివారం వరంగల్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం–1లో తనిఖీ చేస్తుండగా వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా ఎనిమిది సెల్‌ఫోన్లు లభించాయి. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఖమ్మం, వరంగల్ రైల్వేస్టేషన్లలో సెల్‌ఫోన్లు చోరీ చేసినట్లు తేలింది. పది రోజుల క్రితం గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ బ్యాగ్ చోరీ అందులోని హెచ్‌పీ ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను ఖమ్మం పెద్ద తండాలోని వేద సెల్ ఫోన్ షాపులో విక్రయించామని చెప్పగా వాటిని రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్, సీఐబీ సిబ్బంది డి.రాము, ఎం.నాగరాజు, పి.వెంకటేశ్వరరావు, ఎస్.రాజు, సీహెచ్.త్రిమూర్తులు, ఎన్.రమేష్, మనోజ్ పాల్గొన్నారు.

వసూళ్లలో హిజ్రాల మధ్య ఘర్షణ

నేలకొండపల్లి: నిర్దేశించుకున్న పరిధి దాటి వసూళ్లకు వచ్చారంటూ ఇరువర్గాలకు చెందిన హిజ్రాలు ఘర్షణకు దిగారు. వివరాలు... దీపావళి పండుగ మామూళ్లు వసూలు చేసుకునేందుకు ఖమ్మంకు చెందిన పలువురు హిజ్రాలు శనివారం నేలకొండపల్లికి వచ్చారు. అయితే, వారం రోజులుగా వసూళ్లు చేస్తున్న ఇంకొందరు హిజ్రాలు ఎదురుపడడంతో ఖమ్మం నుంచి ఇక్కడకు రావడమేమిటని ప్రశ్నించే క్రమాన మాటామాట పెరిగి గొడవకు దిగారు. దీంతో అరుపులు, కేకలతో ప్రధాన సెంటర్ దద్దరిల్లింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని వారిని అదుపులోకి తీసుకోగా, 12మందిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై పి.సంతోష్ తెలిపారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

ఖమ్మంక్రైం: తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా చెబుతూ ప్రైవేట్ పాఠశాలల నుంచి డబ్బు డిమాండ్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్న కె.రామారావును ఖమ్మం త్రీటౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా సీఐ రమేష్ అక్రమ వసూళ్లకు పాల్పడే వారి వివరాలు తెలియచేయాలని సూచించారు. ఎవరైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ఖమ్మంక్రైం: ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు ఖమ్మం వచ్చిన ఓ వ్యక్తి కానరాకుండా పోయిన ఘటనపై ఆయన బంధువులు ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తికి చెందిన పోలూరి కోటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం చేరాడు. ఆయన కుమారుడు శనివారం ఉదయం టీ తీసుకొచ్చేసరికి కోటేశ్వరరావు లేకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వృద్ధురాలు ఆత్మహత్య

ఖమ్మంరూరల్: అనారోగ్య కారణాలతో మండలంలోని తెల్దారుపల్లికి చెందిన వంగూరి చుక్కమ్మ(70) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. తీవ్రమైన జ్వరం, కీళ్లనొప్పులతో బాధపడుతున్న ఆమె ఈనెల 25న పురుగుల మందు తాగగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిందని సీఐ ముష్కర రాజు తెలిపారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

స్తంభాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేగళ్లపాడుకు చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ పనుల్లో భాగంగా ట్రాక్టర్‌తో స్తంభాన్ని ఢీకొట్టడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన సోయం ఉదయ్ కిరణ్(24) ఆయిల్‌పామ్ తోటలో ట్రాక్టర్ రోటవేటర్‌తో శనివారం దుక్కి దున్నుతున్నాడు. ఈక్రమాన ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా స్తంభం విరిగి ట్రాక్టర్‌పై పడడంతో కిరణ్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు తల్లిదండ్రుల ఫిర్యాదుతో సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రారంభమైన ఐలు రాష్ట్రస్థాయి సదస్సు



మహిళా న్యాయవాదులతో హైకోర్టు జడ్జి శ్రీసుధ, జిల్లా జడ్జి రాజగోపాల్ తదితరులు

హాజరైన హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ

ఖమ్మంలీగల్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) మూడో రాష్ట్రస్థాయి మహిళా న్యాయవాదుల సదస్సు శనివారం ఖమ్మంలో ప్రారంభమైంది. తొలుత ఐలు పతాకాన్ని ఆవిష్కరించగా అధ్యక్షురాలిగా చందాల శైలజ వ్యవహరించారు. ఈసందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ సి.వనజ 'సమాజ నిర్మాణంలో మహిళా న్యాయవాదుల పాత్ర'పై మాట్లాడారు. మహిళా న్యాయవాదులు వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమిస్తూనే మహిళా హక్కుల పరిరక్షణకు తోడ్పడాలని కోరారు.

రాణిస్తున్న మహిళలు

సదస్సులో 'రాజ్యాంగ పరిరక్షణ మహిళా న్యాయవాదుల పాత్ర' అంశంపై జరిగిన సెషన్‌లో హైకోర్టు జడ్జి పి.శ్రీసుధ మాట్లాడారు. మహిళలు న్యాయవాదులుగా రాణిస్తున్నారని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, ఐలు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జి.విద్యాసాగర్, బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ తదితరులు మాట్లాడగా 25ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న మహిళా న్యాయవాదులను సన్మానించారు. ఈసమావేశంలో యూనియన్ బాధ్యులు నల్లమల నవీన్ చైతన్య, మీసాల వెంకటేశ్వర్లు, బోడేపూడి చంద్రశేఖర ఆజాద్, ఏడునూతల శ్రీనివాసరావు, మందడపు శ్రీనివాసరావు, జక్కంపూడి నాగేశ్వరరావు, వంజాకుల లక్ష్మీనారాయణ, తన్నీరు పాపయ్య, వై.నాగేశ్వరరావు, మోతుకూరి వనజ, పి.రామలక్ష్మి, శ్రీలక్ష్మి, పబ్బతి రామబ్రహ్మం, పి.కిషోర్ బాబు, బిల్లా శ్రీనివాస్, గద్దల దిలీప్, క్రాంతికుమారి, మాచర్ల నర్సింహారావు, వెంకటేశ్వర్లు, కె.ఉపేందర్ రెడ్డి, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేద మహాసభలో సరస్వతీస్వామి భాషణం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం బైపాస్ రోడ్డులోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న 24వ తెలంగాణ వేద విద్వన్మహ సభల్లో భాగంగా శనివారం రాత్రి కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ఆన్‌లైన్ ద్వారా అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం సామ, అధర్వణ వేద విద్వాంసులతో వేద స్వస్తి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దోర్బల ప్రభాకరశర్మ వేద విద్య, తదితర అంశాలపై ప్రవచనం చేశారు. అంతేకాక విద్యార్థులకు వేద పరీక్షలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. హవన నిర్వహణ కమిటీ ప్రతినిధులు వల్లమాని లక్ష్మీనారాయణ, బలగం భార్గవ, నందుల సాయిరాం, యడవల్లి సత్యంబాబు, అయితవు వెంకటేశ్వర్లు, శ్రీనివాసశర్మ, మార్తి రామమూర్తి, తుంగతుర్తి యుగంధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



జోహర్ కప్‌లో యువ భారత్‌కు కాంస్య పతకం

సుల్తాన్ జోహర్ కప్ అండర్–21 అంతర్జాతీయ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. మలేసియా వేదికగా శనివారం జరిగిన కాంస్య పతక పోరులో భారత జట్టు షూటౌట్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి కాంస్యం ఖాతాలో వేసుకుంది. గోల్‌కీపర్ బిక్రమ్‌జిత్ సింగ్ ప్రత్యర్థి మూడు గోల్స్ ప్రయత్నాలను అడ్డుకోవడంతో భారత జట్టు విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు రెండేసి గోల్స్ చేయగా... ఫలితం తేల్చేందుకు నిర్వహించిన షూటౌట్‌లో భారత్ 3–2తో గెలుపొందింది. షూటౌట్‌లో భారత్ తరఫున గుర్‌జోత్ సింగ్, మన్‌మీత్ సింగ్, సౌరభ్ ఆనంద్ గోల్ కొట్టారు. అంతకుముందు భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్ (11వ నిమిషంలో), మన్‌మీత్ సింగ్ (20వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... న్యూజిలాండ్ తరఫున బ్రౌన్ (51వ ని.లో), జాంటీ ఎల్మ్స్ (57వ ని.లో) చెరో గోల్ చేశారు. ఆరంభం నుంచి మ్యాచ్‌పై పట్టు కొనసాగించిన భారత జట్టు... చివరి క్వార్టర్‌లో ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇచ్చింది.

‘కివీ’ చేతుల్లో ఖేల్ ఖతం!

అనూహ్యం, అసాధారణమేమీ జరగలేదు... న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ తమ వైఫల్యాన్ని కొనసాగించారు...భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కుప్పకూలి సిరీస్‌ను అప్పగించేశారు... సొంతగడ్డపై కూడా స్పిన్‌ను ఆడలేని తమ బలహీనతను మళ్లీ ప్రదర్శిస్తూ టీమిండియా తలవంచింది...ఫలితంగా పుష్కర కాలం తర్వాత స్వదేశంలో టెస్టు సిరీస్ చేజారింది... ఒక్క యశస్వి జైస్వాల్ మాత్రమే ధాటిగా ఆడి ఆశలు రేపినా... మిగతావారంతా చేతులెత్తేయడంతో మూడో రోజుకే మ్యాచ్ ముగిసింది... కివీ బౌలర్ సాంట్నర్ మరోసారి తన మాయాజాలం ప్రదర్శిస్తూ ఆరు వికెట్లతో చెలరేగాడు. శ్రీలంక చేతిలో చిత్తుగా ఓడి ఏమాత్రం అంచనాలు, ఆశలు లేకుండా భారత గడ్డపై అడుగుపెట్టిన న్యూజిలాండ్ బృందం అసాధారణ ప్రదర్శనతో ఏకంగా 2–0తో సిరీస్‌నే గెలుచుకోవడం విశేషం. ఇక భారత్ ముందు మిగిలింది చివరి మ్యాచ్‌లో నెగ్గి కాస్త పరువు కాపాడుకోవడమే!



విజయానందంలో న్యూజిలాండ్ ఆటగాళ్లు



సాంట్నర్

రెండో టెస్టులో భారత్ ఓటమి

- 113 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- 2–0తో సిరీస్ సొంతం
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 245 ఆలౌట్
- శుక్రవారం నుంచి చివరి టెస్టు

పుణే: స్వదేశంలో భారత జట్టు అనూహ్య రీతిలో టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. శనివారం ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లోనూ నెగ్గిన ఆ జట్టు మరో టెస్టు మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. 359 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 60.2 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (65 బంతుల్లో 77; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధసెంచరీ చేయగా, రవీంద్ర జడేజా (84 బంతుల్లో 42; 2 ఫోర్లు) చివర్లో కాస్త పోరాడాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మిచెల్ సాంట్నర్ (6/104) మరోసారి భారత్‌ను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 198/5తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. ఫిలిప్స్ (48 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బ్లన్‌డెల్ (41; 3 ఫోర్లు) కీలక పరుగులు సాధించారు. భారత బౌలర్లలో సుందర్ 4, జడేజా 3 వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబైలో జరుగుతుంది.

జైస్వాల్ మినహా...

క్రీజ్‌లో జైస్వాల్ ఉన్నంత సేపు భారత జట్టు లక్ష్యంపై గురి పెట్టి దూకుడైన ఆటను ప్రదర్శించేందుకు సిద్ధమైందని అనిపించింది. ఒక వైపు రోహిత్ (8) మళ్లీ విఫలమైనా...మరో ఎండ్‌లో జైస్వాల్ తొలి ఓవర్‌నుంచే బౌండరీలతో చెలరేగాడు. అతనికి శుబ్‌మన్ గిల్ (23) కూడా కొద్ది సేపు సహకరించాడు. లంచ్ సమయానికి భారత్ 81/1తో మెరుగైన స్థితిలో కనిపించగా... విరామం తర్వాత 41 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే రెండో సెషన్‌లో గిల్‌ను అవుట్ చేసి పతనానికి శ్రీకారం చుట్టిన సాంట్నర్ ఆ తర్వాత జైస్వాల్ వికెట్‌నూ ఖాతాలో వేసుకున్నాడు. మరో ఐదు బంతులకే పంత్ (0) అనవసరపు సింగిల్‌కు ప్రయత్నించి రనౌట్ కావడం జట్టును మరింత దెబ్బ తీసింది. కోహ్లి పాయింట్ దిశగా ఆడి పరుగు ప్రారంభించగా... పంత్ మరో ఆలోచన లేకుండా దూసుకొచ్చాడు. అయితే అతను డైవ్ చేసినా లాభం లేకపోయింది. కోహ్లి (17)ని సాంట్నర్ ఎల్బీగా దొరకబుచ్చుకోగా, భారత బ్యాటర్ రివ్యూ చేసినా ఫలితం దక్కలేదు. అనంతరం రెండు పరుగుల వ్యవధిలో సర్ఫరాజ్ (9), సుందర్ (21) అవుటయ్యారు. జడేజా, అశ్విన్ (18) కొద్ది సేపు ప్రతిఘటించినా... అదీ ఎక్కువ సేపు సాగలేదు. అంతకు ముందు న్యూజిలాండ్ మూడో రోజు మరో 16.4 ఓవర్లు ఆడి మరో 57 పరుగులు జోడించగలిగింది.

స్కోరు వివరాలు:

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 259; భారత్ తొలి ఇన్నింగ్స్ 156; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) (బి) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) (బి) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) (బి) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లన్‌డెల్ (బి) జడేజా 41; ఫిలిప్స్ (నాటౌట్) 48; సాంట్నర్ (సి) బుమ్రా (బి) జడేజా 4; సౌతీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; ఎజాజ్ (సి) సుందర్ (బి) జడేజా 1; రూర్కే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (69.4 ఓవర్లలో ఆలౌట్) 255.**
వికెట్ల పతనం: 1–36, 2–78, 3–89, 4–123, 5–183, 6–231, 7–237, 8–238, 9–241, 10–255. **బౌలింగ్:** అశ్విన్ 25–2–97–2, సుందర్ 19–0–56–4, జడేజా 19.4–3–72–3, బుమ్రా 6–1–25–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 77; రోహిత్ (సి) యంగ్ (బి) సాంట్నర్ 8; గిల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 23; కోహ్లి (ఎల్బీ) (బి) సాంట్నర్ 17; పంత్ (రనౌట్) 0; సుందర్ (సి) యంగ్ (బి) ఫిలిప్స్ 21; సర్ఫరాజ్ (బి) సాంట్నర్ 9; జడేజా (సి) సౌతీ (బి) పటేల్ 42; అశ్విన్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 18; ఆకాశ్‌దీప్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; బుమ్రా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (60.2 ఓవర్లలో ఆలౌట్) 245. వికెట్ల పతనం:** 1–34, 2–96, 3–127, 4–127, 5–147, 6–165, 7–167, 8–206, 9–229, 10–245. **బౌలింగ్:** సౌతీ 2–0–15–0, రూర్కే 1–0–5–0, సాంట్నర్ 29–2–104–6, ఎజాజ్ 12.2–0–43–2, ఫిలిప్స్ 16–0–60–1.

12 భారత జట్టు స్వదేశంలో 12 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ కోల్పోయింది. 2012లో ఇంగ్లండ్ చేతిలో టీమిండియా 1–2తో ఓడింది.

18 తాజా ఓటమికి ముందు స్వదేశంలో భారత్ వరుసగా గెలిచిన సిరీస్‌ల సంఖ్య.

1 భారత గడ్డపై న్యూజిలాండ్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం. గతంలో కివీస్ ఇక్కడ 12 సిరీస్‌లు ఆడగా...10 ఓడి 2 డ్రా చేసుకుంది.

‘పరాభవ భారం’

‘నాపై ఇక కత్తులు దూయండి’... బెంగళూరు టెస్టులో 46కు ఆలౌట్ అయిన తర్వాత మీడియా సమావేశంలో రోహిత్ శర్మ వ్యాఖ్య ఇది!

‘12 ఏళ్ల తర్వాత ఒక సిరీస్ ఓడిపోయాం ...ఈమాత్రం మినహాయింపు ఇవ్వడంలో తప్పు లేదు’...రెండో టెస్టులో ఓటమి అనంతరం అదే కెప్టెన్ చెప్పిన మాట ఇది.



ఇన్నేళ్లుగా తమ ఆటతో విజయాలనే తాము అలవాటు చేశామని, కాబట్టి పరాజయం అందరికీ కొత్తగా అనిపిస్తోందని కూడా రోహిత్ అన్నాడు. అంటే 46 ఆలౌట్‌ను ఒకానొక అరుదైన రోజుగా అంగీకరించిన కెప్టెన్‌కు ఇప్పుడు ఓటమి అలవాటైపోయినట్లుగా అనిపించింది! అయితే ఈ పుష్కర కాలంలో అప్పుడప్పుడు వచ్చిన మ్యాచ్ పరాజయాలకు, తాజాగా సిరీస్ కోల్పోవడానికి మధ్య చాలా తేడా ఉంది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలాంటి టీమ్‌లు భారత్‌ను ఓడించేందుకు తీవ్రంగా ప్రయత్నించాయి. మ్యాచ్‌లు గెలిచినా అవి సిరీస్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయాయి. వీటితో పోలిస్తే న్యూజిలాండ్ టెస్టుల్లో అనామక జట్టు కిందే లెక్క. దీనికి ముందు 12 సిరీస్‌లలో కలిపి ఆ టీమ్ ఇక్కడ రెండే మ్యాచ్‌లు గెలవగలిగింది. పైగా ఇటీవలే శ్రీలంక చేతిలో 0–2తో చిత్తుగా ఓడి ఇక్కడకు వచ్చింది. సౌతీ, లాథమ్‌లకు మినహా మిగతావారెవరికీ ఇక్కడ టెస్టులు ఆడిన అనుభవం ఎక్కువగా లేదు. కేన్ విలియమ్సన్‌లాంటి స్టార్ ప్లేయర్ కూడా అందుబాటులో లేడు. అయినా సరే కివీస్ టీమ్ భారత్‌పై పైచేయి సాధించగలిగింది. రెండు పూర్తిగా భిన్నమైన పిచ్‌లపై ఆ జట్టు పైచేయి సాధించిన తీరు టీమిండియా లోపాలను చూపించింది. ముందుగా బెంగళూరు టెస్టులో పేస్ బౌలింగ్ ముందు భారత్ మోకరిల్లి చెత్త రికార్డులను నమోదు చేసింది. దాంతో హడావిడిగా మన బలం స్పిన్ అంటూ పూర్తిగా స్పిన్ పిచ్‌తో సిద్ధమైంది. కానీ ముందు మన బ్యాటర్లు అలాంటి పిచ్‌పై, స్పిన్‌ను సమర్థంగా ఆడగలరా లేదా అనే ఆలోచన రానట్లుంది! అందుకే సాంట్నర్ స్పిన్‌ను కూడా ఎదుర్కోలేకపోయింది. 2017లో ఇదే పుణేలో, ఇదే తరహా పిచ్‌పై ఇలాంటి లెఫ్టార్మ్ స్పిన్నర్ స్టీవ్ ఒ కీఫ్‌కు 12 వికెట్లు అప్పగించి ఆసీస్ చేతిలో భారత్ 333 పరుగులతో చిత్తయింది. ఇప్పుడు కూడా పదునైన స్పిన్‌ను ఆడటం తమ వల్ల కాదని మన బ్యాటర్లు నిరూపించారు. పిచ్‌పై గిర్రున తిరుగుతున్న బంతులకు వారి వద్ద జవాబు లేకపోయింది. బంగ్లాలాంటి బలహీన జట్టుపై దూకుడైన ఆటతో సిరీస్ గెలిచిన వైనంతో మన ప్లేయర్లలో అతి విశ్వాసం పెరిగినట్లు కనిపించింది. పైగా న్యూజిలాండ్ టెస్టుల్లో ప్రభావం చూపలేదనే తేలికపాటి భావం కూడా కావచ్చు! సిరీస్‌లో రోహిత్ విఫలం కాగా, కోహ్లి తన ఆటతో తీవ్రంగా నిరాశపర్చాడు. జైస్వాల్ ఒక్కడే ఆకట్టుకోగా, రెండో ఇన్నింగ్స్‌లో పంత్ రనౌట్ అతని నిర్లక్ష్యాన్ని చూపించింది. సాంట్నర్ చెలరేగిన చోట అదే శైలి బౌలర్ అయిన జడేజాకు తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఇదే టీమ్ ఆస్ట్రేలియాకు వెళ్లి గెలుస్తుందనుకోవడం అత్యాశే. మరో వైపు కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఈ ఓటమిలో పాత్ర ఉంది. బంగ్లాపై సిరీస్ విజయాన్ని గొప్పగా చెప్పుకుంటూ...‘ఒక్క రోజులో 400 పరుగులు చేయగల, అవసరమైతే రెండు రోజులు నిలబడి డ్రా చేసుకోగల జట్టుగా మేం మారాలి. నా దృష్టిలో ఆటలో ఎదగడం అంటే అదే’ అంటూ వ్యాఖ్య చేశాడు. 400 సంగతేమో కానీ మన బ్యాటింగ్ బలహీనత ఏమిటో ఇది చూపించింది. శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ ఓటమి, 46 ఆలౌట్, 36 ఏళ్ల తర్వాత కివీస్ చేతిలో టెస్టు పరాజయం, ఇప్పుడు తొలిసారి సిరీస్, 12 ఏళ్ల తర్వాత స్వదేశంలో పరాభవం...ఇవన్నీ కూడా కోచ్ గంభీర్ ఖాతాలో చేరాల్సినవే! ఇకపై మాటలను కట్టిపెట్టి కోచ్‌గా తన బాధ్యతలు సరిగ్గా నెరవేర్చాల్సిన సమయమిది.

– సాక్షి క్రీడావిభాగం

4 రోహిత్ కెప్టెన్సీలో స్వదేశంలో భారత్ ఓడిన టెస్టుల సంఖ్య. గతంలో అజహర్, కపిల్ కెప్టెన్సీలో 4 మ్యాచ్‌లు ఓడగా... పటౌడీ నాయకత్వంలో భారత్ 9 మ్యాచ్‌లు ఓడింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

యాభైఏళ్ల రాజీనామా



• చిరంజీవి

Mr. K. S. S. V. Prasada Rao, II B. Com., Best actor of the college 1974–75.

కొణిదెల శివ శంకర వరప్రసాద్.... ఈ పేరు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. హీరో చిరంజీవి అసలు పేరు ఇదే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాగా శివ శంకర వరప్రసాద్‌గా రంగస్థలంపై ‘రాజీనామా’ అనే నాటకంతో మొదలైన ఆయన నట ప్రస్థానం యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ ఫొటోను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, ‘‘1974లో నర్సాపూర్‌లోని వైఎన్‌ఎమ్ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నప్పుడు రంగస్థలం మీద నేను వేసిన తొలి నాటకం ‘రాజీనామా’. కోన గోవిందరావుగారు రచించారు. నాకు నటుడిగా తొలి గుర్తింపు ఇచ్చింది ‘రాజీనామా’. అది కూడా బెస్ట్ యాక్టర్‌గా అవార్డు రావడం ఎనలేని ప్రోత్సాహం ఇచ్చింది. 1974–2024... యాభై సంవత్సరాల నట ప్రస్థానం ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది’’ అంటూ రాసుకొచ్చారు చిరంజీవి. ఇదిలా ఉంటే.. చిరంజీవి నటించిన తొలి చిత్రం ‘పునాది రాళ్ళు’. ఈ సినిమాకి గూడపాటి రాజ్‌కుమార్ దర్శకత్వం వహించారు. అయితే ఈ చిత్రం విడుదల ఆలస్యం కావడంతో చిరంజీవి నటించిన ‘ప్రాణం ఖరీదు’ సినిమా మొదట రిలీజ్ అయింది. ‘ప్రాణం ఖరీదు’ చిత్రం 1978 సెప్టెంబరు 22న విడుదల కాగా ‘పునాది రాళ్ళు’ 1979 జూన్ 21న రిలీజ్ అయింది. కాగా ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న చిత్రం ‘విశ్వంభర’. వశిష్ఠ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మిస్తున్నారు.



• రాజ్‌కుమార్ పెరియసామి, శివ కార్తికేయన్, సాయి పల్లవి, సుధాకర్ రెడ్డి, నాగ్ అశ్విన్

ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతాయి

– దర్శకుడు నాగ్ అశ్విన్

‘‘అమరన్’ అద్భుతమైన కథ. రియల్ స్టోరీ తీసినప్పుడు చాలా బాధ్యత ఉంటుంది. ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. కమల్‌హాసన్‌గారు ఈ సినిమాని నిర్మించడం గొప్ప విషయం. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి’’ అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం ‘అమరన్’. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్నారు. ఈ వేదికపై శివ కార్తికేయన్ మాట్లాడుతూ – ‘‘మేజర్ ముకుంద్ వరదరాజన్, ఇందు రెబెకా బయోపిక్‌గా రూపొందిన చిత్రం ‘అమరన్’. ఉద్యోగాన్ని ప్రేమించే కుటుంబం ఎలా ఉంటుందో డైరెక్టర్ రాజకుమార్ అద్భుతంగా చూపించారు. ఈ సినిమాలో నేను మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్ర చేశాను. ‘అమరన్’ లాంటి చిత్రాన్ని సపోర్ట్ చేస్తే ఇలాంటి రియల్ హీరో స్టోరీస్ ఇంకెన్నో వస్తాయి’’ అన్నారు. ‘‘అమరన్’ సినిమాతో మీ ముందుకు రావడం గర్వంగా ఉంది’’ అని సాయి పల్లవి తెలిపారు. ‘‘దేశవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకునే సినిమా ఇది. కమల్‌హాసన్ గారి వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైంది. ఈ సినిమాని ఇంత పెద్ద స్థాయిలో తెలుగులో రిలీజ్ చేస్తున్న సుధాకర్ రెడ్డి సార్‌కి కృతజ్ఞతలు’’ అన్నారు రాజ్‌కుమార్ పెరియసామి. ఈ వేడుకలో నిర్మాత ‘ఠాగూర్’ మధు, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు

– కిరణ్ అబ్బవరం



• నయన్ సారిక, కిరణ్ అబ్బవరం, తన్వీ రామ్

‘క’ కథ విన్నప్పుడు ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకులకు చూపించాలనిపించింది. ఈ సినిమా క్లైమాక్స్ చూసి ఆడియన్స్ ఆశ్చర్యపోతారు. ‘క’ సినిమాలోని ఏదైనా ఎలిమెంట్‌ను గతంలో స్క్రీన్‌పై చూశామని మీకు (ఆడియన్స్) అనిపిస్తే నేను సినిమాలు చేయడం మానేస్తా’’ అని కిరణ్ అబ్బవరం అన్నారు. సుజీత్–సందీప్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన పీరియాడికల్ మూవీ ‘క’. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ నెల 31న ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – ‘క’లో పోస్ట్‌మ్యాన్ వాసుదేవ్‌గా కనిపిస్తాను. తోటి వారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని వాళ్ల ఉత్తరాలు చదువుతుంటాడు వాసుదేవ్. ఈ క్రమంలో అతని జీవితం ఎలా టర్న్ తీసుకుంది? అన్నది కథాంశం. వాసుదేవ్ పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. మా సినిమాను కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో రిలీజ్ చేయాలనుకున్నాం... థియేటర్స్ దొరకలేదు. ప్రస్తుతం తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. వారం తర్వాత మిగతా భాషల్లో రిలీజ్ చేసే ప్రయత్నం చేస్తాం’’ అన్నారు. ‘‘సినిమా ఆరంభం కాగానే ఆడియన్స్ ‘క’ ప్రపంచంలోకి వెళ్తారు’’ అన్నారు సందీప్. ‘‘‘క’కు ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది’’ అని చెప్పారు వంశీ నందిపాటి.



రీతూ వర్మ మజాకా

హీరో సందీప్ కిషన్‌తో కలిసి మజాకా చేస్తున్నారు హీరోయిన్ రీతూ వర్మ. సందీప్ కిషన్, రీతూ వర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘మజాకా’. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతోంది. కాగా ‘మజాకా’ సినిమాలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా వెల్లడించి, వైజాగ్ సెట్స్‌లో రీతూ వర్మ జాయిన్ అయినట్లుగా చిత్రయూనిట్ శనివారం అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం పెళ్లి బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని తెలుస్తోంది. వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

అందమైన ప్రేమకథ




• విహాన్సి, షెరాజ్, నేహా దేశ్ పాండే, భాష్య శ్రీ

షెరాజ్ మెహదీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘ఓ అందాల రాక్షసి’. హీరోయిన్లు విహాన్సి హెగ్డే, కృతీ వర్మ, నేహా దేశ్ పాండే నటించారు. సుమన్, తమ్మారెడ్డి భరద్వాజ కీలక పాత్రలు పోషించారు. షేర్ సమర్పణలో స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్‌పై సురీందర్ కౌర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్, హీరో, మ్యూజిక్ డైరెక్టర్ షెరాజ్ మెహదీ మాట్లాడుతూ– ‘‘ఓ అందాల రాక్షసి’ గ్లామర్ బేస్డ్ మూవీ కాదు. మంచి కంటెంట్ ఉన్న అందమైన ప్రేమకథ. అమాయక మహిళలు కొందరి చేతిలో ఎలా మోసపోతున్నారు?. మోసం చేసేవారికి ఎలాంటి శిక్ష ఉంటుంది? అని ఈ మూవీలో చూపిస్తున్నాం’’ అని తెలిపారు. ‘‘ఓ అందాల రాక్షసి’ సినిమాకు కథ, మాటలు, పాటలు రాశాను’’ అని భాష్య శ్రీ చెప్పారు.

కేజీఎఫ్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది

– దర్శకుడు సూరి



శ్రీ మురళి హీరోగా డా. సూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘బఘీర’. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31 విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రదర్శకుడు డా. సూరి మాట్లాడుతూ– ‘‘ప్రశాంత్ నీల్‌గారి ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల రైటింగ్ విభాగంలో నేనూ ఉన్నాను. శ్రీ మురళిగారితో నేను ఒక సినిమా చేద్దామనుకున్నప్పుడు కథ కుదర్లేదు. అప్పుడు తన దగ్గర కథ ఉందని ప్రశాంత్ నీల్‌గారు చెప్పడంతో ‘బఘీర’ చిత్రం ప్రారంభమైంది. సూపర్ హీరో అవ్వాలనుకున్న ఓ కుర్రాడి కథే ఈ చిత్రం. ఈ సినిమా అవుట్‌పుట్ చూసి ప్రశాంత్ నీల్‌గారు హ్యాపీ ఫీలయ్యారు. శ్రీ మురళి బాగా నటించారు. ‘బఘీర’ను ‘కేజీఎఫ్’తో పోల్చి మాట్లాడుతున్నారు. ‘బఘీర’ సినిమా ‘కేజీఎఫ్’ టోన్‌లో ఉండదు. ‘కేజీఎఫ్’ చరిత్రలాంటి సినిమా. ఈ సినిమాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది’’ అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ‘‘పన్నెండేళ్ల క్రితం యశ్‌తో ఓ సినిమా చేశాను (‘లక్కీ’). ఆ తర్వాత యశ్‌తో ట్రావెల్ అయ్యాను. యశ్ కథలను నేనే వినేవాడిని. అయితే యశ్‌తో నేను అనుకున్న సినిమా వర్కౌట్ కాలేదు. ఆ తర్వాత ‘కేజీఎఫ్’ వల్ల యశ్‌కు చాలా సమయం పట్టింది. దీంతో నేను శ్రీ మురళితో ‘బఘీర’ చేశాను’’ అని తెలిపారు.

ఓటీటీ — ఇది చూడొచ్చు

ఈ కలయిక కాస్త ఘాటు గురూ...

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం ‘ది యూనియన్’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఎక్కడైనా ప్రేమికులు చాలా ఏళ్ల తరువాత కలిస్తే, చాలా హాట్ హాట్‌గా ఉంటుంది. కానీ ఈ ‘ది యూనియన్’ సినిమాలో పాత ప్రేమికులు కలిసిన తరువాత ఇంత ఘాటా అని చూసే ప్రేక్షకుడు నోరెళ్లబెట్టాల్సిందే. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి విశ్లేషించుకుందాం. జూలియన్ ఫరియానో దర్శకత్వం వహించిన స్పై కామెడీ థ్రిల్లర్ సినిమా ‘ది యూనియన్’. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో తెలుగులోనూ ఈ సినిమాని చూడవచ్చు. హేమాహేమీలైన హాలీబెర్రీ, మార్క్ వాబర్గ్, మైక్ కాల్టర్ నటించిన ఈ సినిమా పెద్దలకు మాత్రమే. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... కథానాయకుడు మైక్ మెకన్నా న్యూజెర్సీ నగరంలో ఓ సాధారణ బిల్డింగ్ కార్మికుడు. రోజువారీ కష్టంతో తన పనేదో తాను చూసుకుపోయే మనస్తత్వం గలవాడు. కాకపోతే కాస్తంత అమ్మాయిల పట్ల పిచ్చి ఎక్కువ. హాయిగా సాగుతున్న మైక్ జీవితంలో అనుకోని ఓ అవాంతరం తన హైస్కూల్ క్రష్ అయిన రోక్సెన్ హాల్ ద్వారా ఎదురవుతుంది. 25 ఏళ్ల తరువాత కలిసిన తన ప్రేమను గుర్తు చేసుకుంటూ డాన్స్ చేస్తూ స్పృహ తప్పుతాడు మైక్. అలా న్యూజెర్సీలో స్పృహ తప్పిన మైక్ తిరిగి కళ్లు తెరిచేసరికి లండన్‌లో ఉంటాడు. మరోపక్క ఓ బ్రీఫ్‌కేస్ కోసం ఇరాన్ తీవ్రవాదులు, నార్త్ కొరియా ఏజెంట్లు, రష్యన్ గూఢచారులు తెగ వెతికేస్తుంటారు. ఆ బ్రీఫ్‌కేస్‌లో చాలా సెన్సిటివ్ ఇన్ఫర్మేషన్ ఉంటుంది. దాని కోసం యూనియన్ అనే సంస్థ తమ ప్రతినిధులను చాలా మందినే పోగొట్టుకుంటుంది. అసలు ఆ బ్రీఫ్‌కేస్‌కి, కథానాయకుడు మైక్‌కి సంబంధం ఏంటి? 25 ఏళ్ల తరువాత మైక్ ప్రియురాలు రోక్సెన్ హాల్ అతన్ని ఎందుకు కలిసింది? కలిసిన తరువాత అతను లండన్‌లో ఉండడం ఏంటి? అయినా ఓ ప్రేమికుల కలయికలో ఇంత ఘాటైన ట్విస్టులా? వీటి సమాధానాల కోసం ‘ది యూనియన్’ సినిమా చూడాల్సిందే. ఈ సినిమా ప్రేక్షకుడిని గిలిగింతలు పెట్టిస్తూ ఆద్యంతం థ్రిల్లింగ్ కలిగిస్తుందనడంలో సందేహం లేదు. వీకెండ్ మస్ట్ వాచ్ మూవీ ‘ది యూనియన్’.

– ఇంటూరు హరికృష్ణ